క్లుప్తంగా

28న డాక్టర్ జానమద్ది వర్ధంతి సభ

కడప కల్చరల్ : బ్రౌన్ గ్రంథాలయ రూపశిల్పి, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి 9వ వర్ధంతిని పురస్కరించుకుని ఈనెల 28న స్థానిక సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో స్మారక సభను నిర్వహిస్తున్నామని బ్రౌన్ కేంద్రం సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి యోగి వేమన విశ్వవిద్యాలయం బాధ్య ఉప కులపతి ఆచార్య రంగ జనార్దన ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని, కుల సచివులు ఆచార్య వైపీ వెంకట సుబ్బయ్య సభాధ్యక్షులుగా వ్యవహరిస్తారని తెలిపారు. ప్రధాన వక్తగా సీనియర్ అవధాని డాక్టర్ మేడసాని మోహన్, విశిష్ట అతిథులుగా శ్రీ అచలానంద ఆశ్రమం పీఠాధిపతి స్వామి విరజానంద హాజరవుతారన్నారు. వైవీయూ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య టి.శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి, జానమద్ది సాహితీపీఠం మేనేజింగ్ ట్రస్టీ జానమద్ది విజయభాస్కర్ కూడా ఈ కార్యక్రమానికి అతిథులుగా హాజరు కానున్నారని మల్లికార్జునరెడ్డి వివరించారు.

ప్రతి ఒక్కరూ హక్కుల గురించి తెలుసుకోవాలి



మాట్లాడుతున్న పఠాన్ ఖాదర్‌బాషా

కడప ఎడ్యుకేషన్: విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ మానవ హక్కుల గురించి అవగాహన కలిగి ఉండాలని ష సోషల్ జస్టిస్ ఫర్ ఇంటర్నేషనల్ సివిల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ నగర అధ్యక్షుడు లయన్ పఠాన్ ఖాదర్‌బాషా అన్నారు. మంగళవారం కడప నగరం కాల్వకట్టు విశ్వభారతి ప్రభుత్వ ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు మానవ హక్కుల గురించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ హక్కుల గురించి ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచి తెలుసుకోవాలని అప్పుడే సమాజంలో ముందుకు సాగుతామన్నారు. హక్కుల గురించి తెలుసుకున్నప్పుడే మనం ఏదైనా సాధించవచ్చన్నారు. హెచ్ఎం షఫీ అహ్మద్‌సలీం, ఎస్ఎండి రఫీ, విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రాక్టికల్స్ పేరుతో అక్రమాలు

కడప ఎడ్యుకేషన్: ప్రాక్టికల్స్ పేరుతో అక్రమాలకు పాల్పడే కార్పొరేట్, ప్రైవేటు జూనియర్ కళాశాలపై విచారణ జరిపించాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి నాగేంద్రబాబు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన పీడీఎస్‌యూ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం ఇంటర్ ఒకేషనల్ ప్రాక్టికల్స్ జరుగుతున్నాయన్నారు. ఇందులో కొన్ని ప్రాంతాల్లో అధిక మార్కులు వేయిస్తామని విద్యార్థుల నుంచి 13 వందల నుంచి 2 వేల వరకు డబ్బులను వసూలు చేశారని ఆరోపించారు. వీటికి సంబంధించి ఎటువంటి రసీదు ఇవ్వలేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జగదీస్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆర్ఎస్‌యూ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

కడప ఎడ్యుకేషన్: రెవల్యూషనరీ స్టూడెంట్స్ యూనియన్ (ఆర్ఎస్‌యూ) 8వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి కోరారు. ఇందుకు సంబంధించిన మహాసభ పోస్టర్స్‌ను కడప నగరంలోని శ్రీహరి డిగ్రీ కళాశాలలో కళాశాల అధినేత సుబ్బారెడ్డి ఆవిష్కరించారు. 8వ రాష్ట్ర మహాసభలను ఈనెల 26,27,28 తేదీలలో మూడు రోజులపాటు ఒంగోలు పట్టణంలో నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్, నాయకులు కిరణ్‌కుమార్‌రెడ్డి, సంతోష్, సులేమాన్, ప్రకాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీలకు ఎమ్మెల్సీ స్థానాలు కేటాయించడం చరిత్రాత్మకం

కడప రూరల్ : ప్రప్రథమంగా ఎస్టీ వర్గానికి ఎమ్మెల్సీ సీట్లను కేటాయించడం చారిత్రాత్మకమని బంజారా సేవా సంఘం అధ్యక్షుడు డాక్టర్ ఐ.శివానాయక్ తెలిపారు. నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ అధ్యక్షతన మంగళవారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ గిరిజన వర్గాలను రాజకీయంగా గుర్తించి ప్రోత్సహించడం సంతోషదాయకంగా ఉందన్నారు. కార్యక్రమంలో కె.శ్రీనివాసులు, జగన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

28న ఆప్‌కీ ఆవాజ్ సభ

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఈ నెల 28న ఆప్‌కీ ఆవాజ్ నగర మహాసభ నిర్వహించనున్నట్లు ఆప్‌కీ ఆవాజ్ జిల్లా కార్యదర్శి మగ్బూల్ బాషా పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని ఆప్‌కీ ఆవాజ్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మైనార్టీల సమస్యలు, హక్కులపై పోరాటాలను చేస్తున్నామన్నారు. కేంద్ర బడ్జెట్‌లో మైనార్టీలకు విద్య, ఉపాధిలో నిధులు తగ్గించడం దారుణమన్నారు. ఈ సమస్యలపై నగర మహాసభలో చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆప్‌కీ ఆవాజ్ నాయకులు ఆరిఫ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

మాతృభాష లేనిదే మానవజాతి వికాసం లేదు



మాట్లాడుతున్న డీన్ ఆచార్య తప్పెట రామప్రసాద్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సూర్యారావు

వైవీయూ :మాతృభాషను బతికించుకుంటే సంస్కృతి నిత్యం విలసిల్లుతుందని యోగివేమన విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ హ్యూమానిటీస్ డీన్ ఆచార్య తప్పెట రామప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వైవీయూ తెలుగుశాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృదినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో అమ్ములతో అంతమయ్యే భాష ఒక్క తెలుగు మాత్రమేనని, విదేశీయులు మెచ్చిన సుందర తెలుగు మన భాష అని పేర్కొన్నారు. జాతీయ విద్యావిధానం-2020 ప్రకారం ఉన్నత విద్యాసంస్థల్లో స్థానిక భాషల్లోనే బోధన చేయాలని యూజీసీ నిర్ణయం తీసుకోవడం స్వాగతిస్తున్నామన్నారు. తెలుగుశాఖ ఆచార్యులు, పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్. ఈశ్వరరెడ్డి మాట్లాడుతూ మాతృభాష గొప్పదనం గురించి పద్యాలు, అర్థతాత్పర్యాలతో వివరించారు. తెలుగుశాఖ విభాగాధిపతి ఆచార్య జి. పార్వతి మాట్లాడుతూ మాతృభాషను మాట్లాడుతూనే కొత్త భాషలను నేర్చుకోవాలని సూచించారు. సహ ఆచార్యులు డాక్టర్ ఎం.ఎం. వినోదిని మాట్లాడుతూ రాయలసీమలోని ఇళ్లలో మాట్లాడుకునే భాషకు అక్షరరూపం ఇచ్చే ప్రయత్నం జరగాలన్నారు. అధ్యాపకులు తుమ్మలూరు సురేష్‌బాబు, స్కాలర్లు, విద్యార్థులు మాట్లాడారు. అధ్యాపకులు పాల్గొన్నారు.

కడప ఆర్ట్స్ కళాశాలలో..

మాతృభాష లేనిదే మానవజాతి వికాసం లేదని కడప ప్రభుత్వ పురుషుల కళాశాల తెలుగుశాఖ విభాగాధిపతి డాక్టర్ యు.రమ్యజ్యోతి పేర్కొన్నారు. మంగళవారం కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మాతృభాషలో మాట్లాడటం గర్వంగా భావించాలన్నారు. పొరుగుభాషలను గౌరవించాలని సూచించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. ఎం. రమేష్, డా. బి.ఆర్. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ రీజినల్ కో-ఆర్డినేటర్ డా. కె. చెన్నకేశవరెడ్డి, ఆంగ్లవిభాగాధిపతి డా. విశ్వనాథ్‌రావు, సంస్కృత శాఖాధిపతి డా. వెంకటేశ్వర్లు, హిందీ విభాగాధిపతి డా. రమేష్‌యాదవ్, ఉర్దూ విభాగాధిపతి డా. వసీవుల్లా భక్తియార్ పాల్గొన్నారు.

తెలుగు గొప్పదనాన్ని తెలుసుకోవాలి

కడప ఎడ్యుకేషన్ : తెలుగు భాష గొప్పదనాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సూర్యారావు పేర్కొన్నారు. మంగళవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సూర్యరావు మాతృభాషా ఆవశ్యకత, కాపాడుకోవాల్సిన విధానాల గురించి వివరించారు. ఎన్ఎస్ఎస్ పోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ నీలవేణి, తెలుగు ఆధ్యాపకులు రామాంజనేయులు, అధ్యాపకులు శ్రీవాణి విద్యార్థులు పాల్గొన్నారు.

పిల్లలకు మాతృభాష ప్రాముఖ్యత తెలియజేయాలి

ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులకు మాతృభాష ప్రాముఖ్యతను తెలియచేయాలని ఎస్టీయూ జిల్లా మైనార్టీ కన్వీనర్, ఉర్దూ ప్రాథమిక పాఠశాల హెడ్ టీచర్ ఎస్.నజీముల్లా పేర్కొన్నారు. కడప నగర పాలక సంస్థలోని మున్సిపల్ కార్పొరేషన్ ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో మాతృభాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వెన్నపూస, ఎంవీ రామచంద్రారెడ్డిని గెలిపించండి

కృష్ణ, గుంటూరు జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కల్పలతరెడ్డి



మున్సిపల్ హైస్కూల్లో ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్పలతరెడ్డి

కడప ఎడ్యుకేషన్ : కడప, అనంతపురం, కర్నూలు జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి యంవీ. రామచంద్రారెడ్డి, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిలకు తమ మొదటి ప్రాధాన్యత ఓటును వేసి వేయించి గెలిపించాలని కృష్ణా, గుంటూరు ఎమ్మెల్సీ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి కోరారు. మంగళవారం కడపలోని మున్సిపల్ హైస్కూల్ మెయిన్, గాంధీనగర్ హైస్కూల్, చెమ్మియాపేట జెడ్పీ బాలికల హైస్కూల్, జయనగర్‌కాలనీ జెడ్పీ బాలికల హైస్కూల్స్‌లో పర్యటించి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి అనేక సంక్షేమ కార్యక్రమాలను ఊటంకించారు. కాగా మున్సిపల్ హైస్కూల్ హెచ్ఎంలకు డీడీఓ అధికారులకు కల్పించేందుకు ఎంతో కృషి చేశామన్నారు. ప్రభుత్వం స్పందించి హెచ్ఎంలకు శుక్రవారం డీడీఓ పవర్స్‌ను కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. పీఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు లెక్కలజమాల్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పీవీ సుబ్బారెడ్డి, పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మోపూరు వెంకట శివారెడ్డి, రాష్ట్ర సీపీఎస్ ఎన్నికల కన్వీనర్ గుజ్జల తిరుపాల్, ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు, ఎస్ఆర్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నాగేశ్వరావు పాల్గొన్నారు.

యంవీ రామచంద్రారెడ్డికి మద్దతు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చే స్తున్న యంవీ రామచంద్రారెడ్డి గెలుపునకు కృషి చేస్తామని తమకు సంపూర్ణ మద్దతును ప్రకటిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ పిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్, స్కూల్ అసిస్టెంట్ పిజికల్ డైరెక్టర్ అసోసియేషన్(ఏపీపిఈటీ అండ్ ఎస్‌ఏ పీడీ అసోసియేషన్) గౌరవ అధ్యక్షుడు సాజిద్, బత్తల నిత్య ప్రభాకర్, అధ్యక్షులు ప్రవీణ్‌కిరణ్, జనరల్ సెక్రటరీ శ్రీకాంత్‌రెడ్డి, అంకారావు తెలిపారు. అలాగే మంగళవారం కృష్ణ,గుంటూరు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కల్పలతరెడ్డి, పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కన్వీనర్ పివి రమణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో పలు అంశాలను ఎమ్మెల్సీ కల్పలతరెడ్డి దృష్టికి తీసుకొచ్చారు.

నేటి నామినేషన్స్‌కు తరలిరండి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా యంవీ రామచంద్రారెడ్డి, వెన్నపూస రవీంద్రారెడ్డి ఈనెల 22వ తేదీన నామినేషన్ వేయనున్నారని.. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీలు యస్వీ రమణారెడ్డి, సికె వెంకటనాథ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు అమర్నాథ్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి రమేష్‌బాబు పిలుపునిచ్చారు.రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల నాయకులు, సభ్యులు పాల్గొని నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నాణ్యమైన విత్తనంతోనే అధిక దిగుబడి

ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త శ్రీనివాసచారి

కడప అగ్రికల్చర్: నాణ్యమైన విత్తనంతోనే అధిక పంట దిగుబడి పొందవచ్చని ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త శ్రీనివాసచారి పేర్కొన్నారు. మంగళవారం ఊటుకూరు వ్యవసాయ పరిశోధన కేంద్రంలో ఏఆర్ఎస్ ఆధ్వర్యంలో విత్తనోత్పత్తిపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాన్ని అందించడం కోసం ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం విత్తనోత్పత్తి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. కేవీకే, ఏరువాక కో-ఆర్డినేటర్లు వీరయ్య, మురళీకృష్ణ, సీనియర్ వ్యవసాయ శాస్త్రవేత్త జాన్సన్‌లు విత్తనోత్పత్తి అవశ్యకత గురించి రైతులకు వివరించారు. నాణ్యమైన విత్తనాన్ని ఎంపిక చేసుకున్నప్పుడే మంచి దిగుబడిని సాధించవచ్చన్నారు.ఆత్మపీడీ విజయలక్ష్మి, శాస్త్రవేత్తలు శ్రీవల్లి, సునిత్‌కుమార్ పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్ బీసీల ఆశాజ్యోతి



పూలే విగ్రహం వద్ద హర్షం వ్యక్తం చేస్తున్న బీసీ సంఘాల నాయకులు

కడప రూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బీసీ వర్గాల ఆశాజ్యోతి అని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష, వర్కింగ్ ప్రెసిడెంట్ బత్తల లింగమూర్తి, గోవిందు నాగరాజు తెలిపారు. బీసీలకు 11 ఎమ్మెల్సీ సీట్లను కేటాయించడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. ఆ మేరకు మంగళవారం స్థానిక మహాత్మాజ్యోతిరావుపూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీసీ వర్గాలు ముఖ్యమంత్రికి రుణపడి ఉంటారన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం యువజన అధ్యక్షులు సునీల్ జయంత్, మహిళా అధ్యక్షురాలు వల్లూరు నారాయణమ్మ, నాయకులు త్రివిక్రమ్, జయశ్రీ, పల్లె సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయం అమలులో ఆదర్శం

కడప కార్పొరేషన్: సామాజిక న్యాయం అమలు చేయడంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని ఏపీ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని వైఎస్సార్‌సీపీ నాయకులు ఎం. చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. గతంలో ఏ ప్రభుత్వాలు బీసీలకు ఇంత గొప్పగా మేలు చేయలేదన్నారు. ఈ విషయాన్ని గుర్తించి అన్ని వర్గాల ప్రజలు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు.

దుర్గమ్మ సన్నిధిలో పూజలు

కడప కల్చరల్: శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం భక్తులు దోష నివారణ కోసం రాహుకాల పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో సామూహికంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. అర్చకులు పూజా విధానాన్ని తెలుపుతూ కార్యక్రమాన్ని నిర్వహింపజేశారు. భక్తులు అమ్మవారికి నిమ్మకాయ దీపాలను వెలిగించి మొక్కుకున్నారు.

పోస్టల్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న పోస్టల్ ఉద్యోగులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కేంద్ర ప్రభుత్వం పోస్టల్ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం డివిజనల్ సెక్రటరి జీవీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. పోస్టల్ ఉద్యోగులపై టార్గెట్ల వేధింపులు ఆపాలని కోరుతూ మంగళవారం పోస్టల్ ప్రధాన కార్యాలయం ఎదుట ఉద్యోగులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్టల్ ఉద్యోగులకు ఆచరణ సాధ్యంకాని టార్గెట్లను విధిస్తూ మానసికంగా ఒత్తిడికి గురిచేస్తోందన్నారు. ఉద్యోగులపై టార్గెట్ల వేధింపులను మానకపోతే విజయవాడలోని సీఎంఎంజీ కార్యాలయం ఎదుట ధర్నా చేపడతామన్నారు. అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం నాయకులు పీఎం సలాం, రమణయ్య, పాలకొండ్రాయుడు, మునాఫ్, వెంకట్, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

వారసత్వ సంపద భవిష్యత్తు మీపైనే!



మాట్లాడుతున్న చిన్నపరెడ్డి

కడప కల్చరల్ : మన పూర్వీకులు, ప్రకృతి, మేధావులు మనకు అందించిన విలువైన జాతీయ వారసత్వ సంపదను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత నేటితరం విద్యార్థులపైనే ఉందని లయన్స్ పాస్ట్ గవర్నర్ మానస కె.చిన్నపరెడ్డి అన్నారు. భారత జాతీయ కళావారసత్వ పరిరక్షణ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం కడప నగరంలోని మున్సిపల్ హైస్కూలు మెయిన్‌లో జాతీయ వారసత్వ సంపదపై విద్యార్థులకు వ్యాసరచన, పోస్టర్ డిజైనింగ్ పోటీలు నిర్వహించారు. ఇంటాక్ జిల్లా కన్వీనర్ ఎస్.ఎలియాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి చిన్నపురెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మానవుని మనుగడ ఆహారంపైనే ఆధారపడి ఉందన్న విషయాన్ని నేటి తరానికి తెలిపేందుకు వారసత్వ ఆహారం గురించి పోటీలు సంస్థ నిర్వహిస్తోందన్నారు. సంస్థ కన్వీనర్ ఎలియాస్‌రెడ్డి మాట్లాడుతూ ఆదిమానవుడి నుంచి ఆధునిక మానవుడి వరకు ఆహారానికి ముఖ్య పాత్ర ఉందని, ఆహారం లేనిదే మానవుడు లేడని నాటి నుంచి నేటి వరకు ఆహారం విషయంలో వస్తున్న మార్పుల గురించి అవగాహన కల్పించేందుకు ఈపోటీలు నిర్వహిస్తున్నామన్నారు. సంస్థ జీవిత కాల సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి మాట్లాడారు. సంస్థ కో కన్వీనర్ పాలెం వేణుగోపాల్, ప్రధానోపాధ్యాయులు నాగమణి, పీవీ సుబ్బారెడ్డి, పార్వతమ్మ, శాంతినికేతన్‌హైస్కూలు సిబ్బంది పాల్గొన్నారు. ఈ పోటీకి దాదాపు 300 మందికి పైగా నగరానికి చెందిన వివిధ పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు. సంస్థ ఇచ్చిన అంశంపై విద్యార్థులు ఉత్సాహభరితంగా పాల్గొన్నారు. వ్యాసరచనతోపాటు పోస్టర్ డిజైనింగ్‌లో కూడా ఆసక్తిగా పాల్గొన్నారు.

జాబ్‌డ్రైవ్‌లో 10 మందికి ఉద్యోగాలు

వైవీయూ : కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో మంగళవారం నిర్వహించిన జాబ్‌డ్రైవ్‌లో 10 మంది విద్యార్థులకు ఉద్యోగాలు లభించినట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డా. ఎం .రమేష్ తెలిపారు. కళాశాల జేకేసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ జాబ్‌డ్రైవ్‌లో హెటిరోల్యాబ్స్ కంపెనీ ప్రతినిధులు హాజరై జూనియర్ కెమిస్ట్/జూనియర్ ఆపరేటర్, జూనియర్ ఆఫీసర్ ఉద్యోగాలకు 10 మందిని ఎంపిక చేశారన్నారు. జేకేసీ కోఆర్డినేటర్ డా. కె.రేఖ, మెంటార్లు సారథి, మంజుల, హెటిరో సంస్థ ప్రతినిధి సీమోను పాల్గొన్నారు.

విద్యార్థులు సత్ప్రవర్తనతో విద్యను అభ్యసించాలి

జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. కవిత



మాట్లాడుతున్న జడ్జి ఎస్. కవిత

కడప అర్బన్ : విద్యార్థులు సత్ప్రవర్తనతో విద్యను అభ్యసించాలని, చదివిన సంస్థకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. కవిత అన్నారు. మంగళవారం కడప నగరంలోని ప్రకాష్‌నగర్‌లోని సాంఘిక సంక్షేమశాఖ ప్రభుత్వ కళాశాల బాలుర వసతి గృహాన్ని జడ్జి సందర్శించారు. వంటశాలను, వసతి గదులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ జాతీయ న్యాయసేవాధికారసంస్థ వారి బాలల సంరక్షణ కోసం స్నేహపూర్వక న్యాయసేవలు పథకం 2015ను వివరించారు. ఏవైనా సమస్యలుంటే జిల్లా న్యాయసేవాధికారసంస్థ దృష్టికి తీసుకురావచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమశాఖ జాయింట్ డైరెక్టర్ జయప్రసాద్, అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ లక్ష్మినారాయణ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మట్కా బీటర్ల అరెస్ట్

కడప అర్బన్ : కడప నగరంలోని చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పాత బైపాస్ సమీపంలో మట్కా రాస్తున్న ముగ్గురిని సీఐ శ్రీరామ్ శ్రీనివాస్, ఎస్ఐ అమర్‌నాథ్‌రెడ్డి, తమ సిబ్బందితో కలిసి మంగళవారం సాయంత్రం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.45,000ల నగదుతో పాటు, మట్కా స్లిప్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎవరైనా మట్కా, క్రికెట్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్‌లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉపాధి పనుల్లో పొరపాట్లు ఉండకూడదు

డ్వామా పీడీ యదుభూషణ్ రెడ్డి



సామాజిక తనిఖీ ఓపెన్ ఫోరంలో సమీక్షిస్తున్న డ్వామా పీడీ యదుభూషణ్ రెడ్డి


వల్లూరు : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనుల్లో ఎలాంటి తప్పులు, పొరపాట్లు జరగకుండా సిబ్బంది చర్యలు చేపట్టాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు డ్వామా పీడీ యదుభూషణ్ రెడ్డి తెలిపారు. వల్లూరు మండలంలో 2021-22 సంవత్సరంలో చేపట్టిన ఉపాధి హామీ పనులకు సంబంధించి స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో మంగళవారం జరిగిన 16వ విడత సామాజిక తనిఖీ ఓపెన్ ఫోరంలో ఆయన పాల్గొని సామాజిక తనిఖీ నివేదికలను సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వ్యవసాయ పనులు ముగింపు దశలో వున్నందున ప్రతి గ్రామంలో ఉపాధి హామీ పనులను ప్రారంభించి అడిగిన కూలీలందరికీ పనులు కల్పించాలన్నారు. ప్రతిరోజు పని ప్రారంభ సమయంలో ఒక ఫొటో, ముగించిన తరువాత ఒక ఫొటోను ఎన్ఎంఎంఎస్ ద్వారా తప్పని సరిగా అప్‌లోడ్ చేయాలన్నారు. కూలీలకు ఇబ్బందులు లేకుండా పనులు కల్పిస్తూ రోజుకు సరాసరి వేతనం రూ.257 పడేలా చూడాలన్నారు.

రూ. 63,426 రికవరీ చేయాలి

సామాజిక తనిఖీ బృందం గుర్తించిన మేరకు పనుల వద్ద నేమ్ బోర్డులు పెట్టని పనులకు సంబంధించి ఆయా గ్రామ పంచాయతీల నుంచి రూ. 63,426 నగదును రికవరీ చేయాలని ఆయన ఆదేశించారు. ప్లాంటేషన్ పనుల్లో తక్కువ చెట్లు వున్న చోట్ల తిరిగి మొక్కలను నాటాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీవీఓ యోగాంజనేయ రెడ్డి, అంబుడ్స్‌మెన్ సాంబశివారెడ్డి, కమలాపురం క్లస్టర్ ఏపీడీ సోమశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ జుబేద, క్వాలిటీ కంట్రోల్ అధికారులు విజయభాస్కర్, అంజలి, ఏఈలు పవన్, ముజీబ్, ఎస్ఆర్‌పీ తిరుమలేసు, ఏపీఓ పార్థ సారధి, డీఆర్‌పీలు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను డ్వామా పీడీ వీ యదుభూషన్‌రెడ్డి పరిశీలించారు. మండలంలోని వల్లూరు, గోటూరు గ్రామ పంచాయతీల పరిధిలో జరుగుతున్న ఫీల్డ్ కాలువల పనులను ఆయన పరిశీలించారు. పనులు జరుగుతున్న తీరును గురించి, కూలీ గురించి కూలీలతో మాట్లాడారు. అనంతరం ఆదినిమ్మాయపల్లె గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ పథకం కింద రైతులు సాగుచేసిన మామిడి, చీనీ తోటలను ఆయన పరిశీలించారు. రైతులకు అందాల్సిన చెల్లింపులను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీడీ సోమ శేఖర్ రెడ్డి, అంబుడ్స్‌మెన్ సాంబశివారెడ్డి, ఏపీఓ పార్థ సారధి, ఈసీ అన్నా నాయక్, టీఏలు రెడ్డయ్య, కుమారి, రైతులు పాల్గొన్నారు.





यूनियन बैंक Union Bank of India **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**

రీజినల్ ఆఫీస్ : 21/58, అనెక్స్ బిల్డింగ్, @ BSNL కాంపౌండ్, హెడ్ పోస్టాఫీస్ ప్రక్కన, ట్రంక్ రోడ్డు, కడప - 516 001. ఆంధ్రప్రదేశ్.

ఇ-వేలం అమ్మకం ప్రకటన

స్థిరాస్తుల అమ్మకం కొరకు 15 రోజుల ప్రకటన

1. కడప మెయిన్ (eCB) బ్రాంచ్: మొదటి అంతస్తు, 2/13, KNR కాంప్లెక్స్, ఆర్.ఎస్.రోడ్, కోటిరెడ్డి సర్కిల్ దగ్గర, కడప, YSR కడప జిల్లా.-516001.

B) రుణ బకాయి - 31-12-2022 నాటికి రూ. 18,80,458.91/- + భవిష్యత్ వడ్డీ & దానిపై న్యాయపరమైన ఖర్చులు, స్వాధీనత తేది : 25-01-2022 (లాంఛనప్రాయం)

D) రిజర్వు ధర : రూ. 26,50,000/- & బయానా : రూ. 2,65,000/-

బయానా మొత్తం దాఖలు చేసేందుకు ఆఖరి తేది : 09-03-2023న సా॥ 4.30 గం॥ లోగా

2) https://www.mstcecommerce.com ... https://www.unionbankofindia.co.in ... www.mstcecommerce.com/ auctionhome/ ibapi/ index.jsp ... KYC

(సంప్రదించవలసిన నంబరు : 8332830696/ 8985681081)

తేది: 21-02-2023, ప్రదేశం : కడప

సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా